క్లుప్తంగా

సమస్యలు పోలీసులకు తెలియజేయండి



మాట్లాడుతున్న అర్బన్ సీఐ రమణారెడ్డి

మైదుకూరు : గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా ముందుగా తమకు తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మైదుకూరు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని వనిపెంటలో ఆయన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో చిన్న చిన్న విషయాలకు గొడవకు దిగరాదని సూచించారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలని పేర్కొన్నారు. గ్రామ సభలో అర్బన్ ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఘన సన్మానం



మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని సన్మానిస్తున్న భాస్కర్‌రెడ్డి

బ్రహ్మంగారిమఠం : మైదుకూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు శెట్టిపల్లె రఘురామిరెడ్డిని సోమవారం సాయంత్రం మైదుకూరు పార్టీ కార్యాలయంలో ఘన సన్మానించారు. బి.మఠం మండల వాసి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎంపికైన అంబవరపు భాస్కనర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలతో పాటు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అప్పజెప్పిన బాధ్యతను తప్పకుండా నెరవేరుస్తానన్నారు. కార్యక్రమంలో మదీనా దస్తగిరి, ఇత్తనాల సుబ్బారెడ్డి, కిరణ్‌మయి, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులు మఠం అభివృద్ధికి సహకరించాలి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం అభివృద్ధికి దేవస్థానం పరిధిలో ఉన్న వ్యాపారులు సహకరించాలని మఠం పిట్‌పర్సన్ శంకర్ బాలాజీ కోరారు. సోమవారం సాయంత్రం సిబ్బందితో కలసి స్థానిక వ్యాపార సముదాయల దగ్గరకు వెళ్లి వ్యాపారులతో మాట్లాడారు. వ్యాపారులు కూడా దేవస్థానం అభివృద్ధికి సహకరిస్తామని కొంతమంది ముందుకు వచ్చారు. ప్రతి వ్యాపారి ఇలానే ఆలోచించాలన్నారు. అప్పుడుమాత్రమే ప్రజా ప్రతినిధుల సహకారంతో ముందుకు పోతామని శంకర్ బాలాజీ తెలిపారు.

'పోలీసులు ఇబ్బంది పెడుతున్నారు'

ప్రొద్దుటూరు క్రైం : 'డబ్బులు ఇవ్వమని పోలీసులు ఇబ్బంది పెడుతున్నారు.. నా దగ్గర కిడ్నీలు తప్ప ఏమీ లేవు' అని ప్రొద్దుటూరులోని శ్రీరాంనగర్‌కు చెందిన చిన్నా అనే వ్యక్తి మాట్లాడిన వీడియో ఫేస్‌బుక్‌లో వైరల్ అవుతోంది. 'జిల్లా ఎస్పీ, మన ప్రొద్దుటూరు డీఎస్పీ గారికి నమస్కారం. నేను తెలిసో తెలియక ఆన్‌లైన్ యాప్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించాను. కానీ పోలీసు వారికి దొరకలేదు. ఒక కానిస్టేబుల్ నన్ను బెదిరించి రూ. లక్ష లంచం తీసుకున్నాడు. స్టేషన్‌లో నీకు అన్ని విధాలుగా సహాయ పడతాను..నీపై కేసు పెట్టము, సబ్ జైలుకు పంపించనని చెప్పాడు. స్టేషన్ వద్దకు వెళ్లాక మరో కానిస్టేబుల్ కూడా రూ. లక్ష తీసుకొని ఆ డబ్బుతో శాంసంగ్ సెల్ కొన్నాడు. ఫోన్ చూపించి ఏం బామర్ది నీ దయతో ఫోన్ కూడా కొన్నానని చెప్పాడు. నీకు సహాయం చేస్తానని చెప్పి రెండు మూడు రోజులు స్టేషన్ చుట్టూ తిప్పుకున్నారు. ఎస్ఐ సార్ వినలేదు.. రూ. లక్షలు ఇస్తే సబ్‌జైలుకు పంపకుండా ఏదో ఒకటి సెట్ చేసి పంపిస్తామని చెబుతున్నారు. నా దగ్గర రెండు కిడ్నీలు తప్ప ఏమీ లేవు కొడతారేమో కొట్టండి, చంపుతారేమో చంపండి అని చెప్పాను' అని చిన్నా వీడియోలో మాట్లాడాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది.

కేసు నుంచి తప్పించుకునేందుకే ..

అతను కేసు నుంచి తప్పించుకునేందుకే పోలీసులపై ఆరోపణలు చేస్తున్నాడని రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. అతను క్రికెట్ బెట్టింగ్ నిర్వహించడంతో పాటు పేకాట నిర్వహిస్తున్నాడని చెప్పారు. కేసు పెట్టేందుకు ఆధార్ కార్డు తీసుకొని రమ్మని చెప్పామన్నారు. అయితే అతను స్టేషన్‌కు రాకుండా తప్పించుకొని తిరుగుతున్నాడని తెలిపారు. అతని వద్ద నుంచి ఎవరూ డబ్బు తీసుకోలేదని ఆ వ్యక్తి ఆరోపణల్లో వాస్తవం లేదని ఎస్ఐ వివరణ ఇచ్చారు.

పింఛన్లకు బ్రేకులు

భారమవుతున్న బతుకుకు ఆసరా అందడం లేదు. కూటమి ప్రభుత్వంలో ఒక్కరికి కూడా కొత్తగా పింఛన్ మంజూరు కాలేదు. కొత్త దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తీసుకోవడం ఆగిపోయింది. వితంతువులు, బతుకుదెరువు లేకుండా పోయిన దివ్యాంగులు, కన్నవారి ఆదరణకు నోచుకోని వృద్ధులు, కార్మికులు వేలాది మంది కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



- వితంతువులకు తప్పని ఎదురుచూపులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేదంటున్న అధికారులు

కాశినాయన : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 11 నెలలు దాటుతున్నా నేటికీ ఒక్క సంక్షేమ పథకం కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్న దాఖలాలు లేవు. చివరకు ఏ దిక్కు మొక్కు లేని వృద్ధులు, వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు చేసేందుకు వెనుకంజ వేస్తుంది. జిల్లాలో పింఛన్లకు వేలాది మంది అర్హులు ఉన్నా వారికి నిరాశే ఎదురవుతుంది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే భార్యకు మాత్రమే బదిలీ చేస్తున్నారు. పింఛన్ రాని వ్యక్తి చనిపోతే ఆయన భార్యకు మొండిచేయి చూపుతున్నారు.

పింఛన్ డబ్బులు పెంచామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు చేయకపోవడంపై ప్రజల నుండి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో అధిక శాతం మంది పేద, మధ్యతరగతి వారు ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగులతో పాటు వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది అవస్థలు పడుతున్నారు. తాజాగా స్పౌజ్ కేటగిరీలో పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏదైనా పింఛన్ పొందుతూ భర్త మృతిచెందిన మహిళలకు మాత్రమే ఈ కేటగిరీలో పింఛన్లు మంజూరు చేస్తారు. వివిధ కేటగిరీల్లో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి నిరాశే మిగులుతుంది.

పింఛన్ల కోసం ఎదురుచూపులు

కూటమి పాలనలో కొత్త పింఛన్లకు సంబంధించి ఎటువంటి దరఖాస్తులు స్వీకరించడం లేదు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య సామాజిక పింఛన్‌దారు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగిరీలో పింఛన్ మంజూరుకు అర్హులుగా నిర్ధారిస్తున్నారు. దీంతో ఎటువంటి పింఛన్ పొందని వ్యక్తి మరణించినా ఆ కుటుంబంలో అర్హులకు నిరాశే ఎదురవుతుంది. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది వితంతువులు పింఛన్ పొందేందుకు అర్హులుగా ఉన్నారు. పింఛన్ల సంఖ్య పెంచకుండా ప్రభుత్వం సర్దుబాటు చేస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

> **కొత్తగా దరఖాస్తులకు అవకాశం లేదు**
>
> 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య సామాజిక పింఛన్‌దారు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగిరీలో పింఛన్ మంజూరుకు అవకాశం ఉంది. కొత్తగా పింఛన్లు దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతానికి అవకాశం లేదు. సర్వర్ ఓపెన్ అయితే అర్హులైన వారు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
>
> – మైథిలి, ఎంపీడీఓ, కాశినాయన మండలం

హైస్కూల్‌ను కాపాడుకుందాం



మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌వలి

కలసపాడు : పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మంజూరైన హైస్కూల్‌ను, మోడల్ ప్రైమరీ హైస్కూల్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంఈఓ మస్తాన్‌వలి పేర్కొన్నారు. సోమవారం తెల్లపాడు గ్రామంలోని దేవాలయం వద్ద గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, యువకులు, విద్యావంతులు, తల్లిదండ్రులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మస్తాన్‌వలి మాట్లాడుతూ మండలంలోనే కాక జిల్లాలో కూడా మారుమూల ప్రాంతమైన తెల్లపాడుకు హైస్కూల్ మంజూరు కావడం సంతోషించదగ్గ విషయమన్నారు. హైస్కూల్ విద్య కోసం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కలసపాడుకు వెళ్లలేక చాలా మంది బాలికలు మధ్యలోనే చదువు మానేస్తూ ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ఇప్పుడు బాలికలందరూ హైస్కూల్ విద్యను అభ్యసించే అవకాశం కలిగిందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైస్కూల్‌లో ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు, ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపాలని కోరారు. అనంతరం గ్రామంలో గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కె.రమణారెడ్డి, డి.ఈశ్వర్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, ఉపాధ్యాయుడు పోలిరెడ్డి, వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు ప్రసాద్, శేఖర్‌బాబు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల నివాస స్థలాలను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వివిధ ప్రభుత్వ స్థలాల్లో స్థిర నివాస గృహాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేదల నివాస స్థలాలను కూడా క్రమబద్ధీకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. స్థానిక పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డులోని భగత్‌సింగ్‌నగర్‌లో నిర్వహించిన సీపీఐ శాఖ మూడవ మహాసభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లీం మైనార్టీ వర్గాలకు చెందిన పేద ప్రజలు ఆయా గ్రామాల్లో పనులు లేక ఉపాధి నిమిత్తం బద్వేలు పట్టణానికి వచ్చి ప్రభుత్వ స్థలాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, కనీస మౌళిక వసతులు లేకపోయినా అక్కడే ఆశ్రయాన్ని పొందుతున్నారని అన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం విడుదల చేసిన క్రమబద్ధీకరణ విధానంలో పేదల గృహాలను సైతం క్రమబద్ధీకరించి పేదలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు పి.వెంకటరమణ, డీహెచ్‌పీఎస్ నాయకులు పెంచలయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు విజయమ్మ, సీపీఐ పట్టణ నాయకులు నాగసుబ్బయ్య, యేసన్న, సుబ్బారెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో నూతన భవనాల నిర్మాణానికి భూమి పూజ



కళాశాల భవన నిర్మాణాలకు భూమి పూజచేస్తున్న ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ మద్దిరెడ్డిపల్లె సమీపంలో కస్తూర్బా పాఠశాల ఆవరణంలో రూ.1.31కోట్లతో నూతనంగా నిర్మించనున్న జూనియర్ కళాశాల నూతన భవనాలకు సోమవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ విద్యను విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఇక్కడ దాదాపు 70 మంది విద్యార్థునులు చదువుకుంటున్నారు. కళాశాలకు ప్రత్యేక భవనాలు లేకపోవడంతో వారి ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలో అన్ని వసతులతో భవనాలు నిర్మాణం అవుతాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, నాయకులు ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి, పూజా శివయ్య యాదవ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు శీలం నరసింహులు గౌడు, అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు అన్వేష్

అట్లూరు : కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ నెల 20న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్వేష్, మండల కార్యదర్శి రమణయ్య కోరారు. సోమవారం అట్లూరు క్రాస్ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపైన నాలుగు లేబర్ కోడ్స్ విధించారని, వాటి వలన కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలు కావడం లేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఉపాధి కూలీలకు ప్రతి వారం డబ్బులు చెల్లించకుండా నెలల తరబడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, అలాగే ఉపాధి సిబ్బందికి జీతాలు పెంచకుండా నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పనులు కల్పించాలని, నేటి ధరలకు అనుగుణంగా రూ.600లు కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు. యువతకు ఉపాధి కల్పించే ఉక్కు పరిశ్రమను కడప జిల్లాలో నెలకొల్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు భూ పంపిణీ చేయాలని, అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దుర్గమ్మ, స్వప్నమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

మాజీ మంత్రిపై పోలీసుల దౌర్జన్యం దారుణం

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి



పోరుమామిళ్ల : పల్నాడు జిల్లా నాందెడ్ల మండలం మానుకొండవారిపాలెంలో ఓ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి విడదల రజనిపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడటం దారుణమని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి చెందిన శ్రీకాంత్‌ను అరెస్టు చేయడంపై పోలీసులను ప్రశ్నించిన విడదల రజనిపై సీఐ సుబ్బారాయుడు దౌర్జన్యంగా వ్యవహరించారని, మాజీ మహిళా మంత్రి అని కూడా చూడకుండా పోలీసులు ప్రదర్శించిన వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మహిళల పట్ల పోలీసులు అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తున్నారని పలు సందర్భాల్లో రుజువైందన్నారు. నిర్బంధాలు, అణచివేతలతో వైఎస్సార్‌సీపీని అడ్డుకోవాలని చూస్తే బెదిరేది లేదని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాక్షాలను కట్టడి చేయాలని చూస్తున్నారని, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ఎక్స్‌రే తీయించుకునేందుకు వెళ్తే వెనక్కి పంపించారు



పాపిరెడ్డి, ఓటీ అసిస్టెంట్, పీపీ యూనిట్

ప్రొద్దుటూరు క్రైం : ఎక్స్‌రే తీయించుకునేందుకు వెళ్తే తీయనని వెనక్కి పంపించారు.. ఆస్పత్రిలో పని చేస్తున్న తనకే దిక్కులేదని అతను ఆవేదన వ్యక్తం చేశాడు.. ఎం పాపిరెడ్డి జిల్లా ఆస్పత్రిలోని పీపీ యూనిట్ విభాగంలో ఓటీ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు కొన్ని రోజులుగా నడుముల్లో నొప్పిగా ఉండటంతో సోమవారం ఆర్థోపెడిక్ వైద్యుడిని సంప్రదించాడు. డాక్టర్ పరిశీలించి ఎక్స్‌రే తీయించుకోమని రిక్విజేషన్ రాశాడు. రేడియాలజి డిపార్ట్‌మెంట్‌లో పేరు నమోదు చేయించుకొని అక్కడి వ్యక్తి ద్వారా పాపిరెడ్డి ఎక్స్‌రే విభాగానికి వెళ్లాడు. అయితే అక్కడికి వెళ్లగా 'నేను అతనితో కొట్లాడాను.. అతనికి ఎక్స్‌రే తీయను' అని సిబ్బంది ఒకరు చెప్పడంతో వెనుతిరిగి వచ్చినట్లు పాపిరెడ్డి ఆరోపిస్తున్నాడు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు అతను తెలిపాడు.

నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ భావన తెలిపారు. మండలంలోని కామనూరు గ్రామంలో సోమవారం రాత్రి పోలీసు కళాజాతర బృందంచే మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా వారిని సరైన మార్గంలో నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ అరుణ్‌రెడ్డి, ఫ్యాక్షన్ జోన్ సీఐ రియాజ్ అహ్మద్, ట్రైనీ డీఎస్పీ భవాని, కళాజాతర బృందం పాల్గొన్నారు.

• వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో గంగా, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. గంగా, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. అనంతరం రథంపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. పురవీధుల్లో శివనామస్మరణల మధ్య రథోత్సవం నిర్వహించారు. దారి వెంబడి స్వామివారికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి పూజించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం లైట్‌పాలెం సెంటర్, కొవ్వూరు గ్యారేజీ మీదుగా అమ్మవారిశాలకు చేరుకుంది. తిరిగి సాయంత్రం బంగారంగళ్ల వీధి, పప్పుల బజార్ మీదుగా ఆలయానికి చేరుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రథోత్సవాన్ని ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

• ఘనంగా విగ్రహ ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

అట్లూరు : మండలంలోని కుంభగిరి గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ధ్వజశిఖర కలశ నూతన విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

• గరుడ వాహనంపై చెన్నకేశవుడు

రాజుపాళెం : మండలంలోని వెల్లాలలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవ రోజు సోమవారం రాత్రి గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి విగ్రహాలను పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ముందుగా ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆశీనులు చేసి అర్చకులు స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణ రెడ్డి, ఎస్ఐ వెంకటరమణ, భక్తులు స్వాముల వారిని దర్శించుకుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

• కల్యాణ వైభోగమే..



కల్యాణోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మి సమేత చెన్నకేశ్వస్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున చెన్నకేశవస్వామి, మహాలక్ష్మిదేవి మూల విరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితులు సుముహూర్తంలో వేద మంత్రోచ్ఛారణతో స్వామివారి కల్యాణోత్సవాన్ని మంగళ వాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

• ఘనంగా లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణం



లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి.

• కనుల పండువగా మొలకల పౌర్ణమి



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయ స్వామి

ఖాజీపేట : సుంకేశుల గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం మొలకల పౌర్ణమి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సుంకేశుల గ్రామం నుంచే కాక మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యుల అధ్వర్యంలో వృషభరాశులచే బండ లాగుడు పోటీలను నిర్వహించారు.

• భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



ప్రత్యేక అలంకరణలో సత్యనారాయణ స్వామి



వత్రంలో పాల్గొన్న దంపతులు, భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గణపతి, ఆంజనేయస్వామి, దత్తాత్రేయ స్వామి, సుదర్శన యోగ నరసింహస్వామి, సత్యనారాయణ స్వామి, మహా శివుడు, చాముండేశ్వరిలకు విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. సత్యనారాయణ స్వామి వ్రతం చేయడం వల్ల కలిగే శుభాలను భక్తులకు అర్చకులు వివరించారు. వ్రతం అనంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.

లలితాదేవికి ప్రత్యేక పూజలు

స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. లలితాదేవి, రతనాల వెంకటేశ్వరస్వామి మూల విరాట్‌లకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా లలిత సహస్రనామ పారాయణం పఠించారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

మైదుకూరు : మైదుకూరులోని శ్రీలక్ష్మీ మాధవరాయ స్వామి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయ చైర్మన్ బండి బెల్లం సుబ్బరాయుడు ఆధ్వర్యంలో వ్రతాన్ని నిర్వహించారు. శ్రీరమా సమేత సత్యనారాయణ స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ వేద పండితులు మాధవాచార్యులు, లోకేశ్వరాచారి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్యనారాయణస్వామి ఘనతను, భక్తులను ఆదుకున్న కథలను వ్రత దీక్షలో పాల్గొన్న దంపతులకు, భక్తులకు వివరించారు. అన్నవరం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయం నుండి తెప్పించిన నాణెములను, వస్త్రాలను, ప్రసాదాన్ని అందరికి పంపిణీ చేశారు.

ఘనంగా జెండా ఊరేగింపు

మైదుకూరు : పట్టణ పరిధిలోని కొత్తపాలెంలో శ్రీవీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జెండా ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వినియోగం చేశారు. మంగళవారం రాష్ట్ర స్థాయి సీనియర్ కేటగిరి వృషభరాజములకు బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు రూ.80వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు ప్రకారం బహుమతులు అందజేయనున్నట్టు ఉత్సవ నిర్వాహకులు, ఆలయ ధర్మకర్త చిట్టిబోయిన సుబ్బరాయుడు తెలిపారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవు

బద్వేలు అర్బన్ : సామాజిక మాధ్యమాల్లో సున్నిత అంశాల మీద తప్పుడు ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అర్బన్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం రాత్రి పట్టణంలోని పోరుమామిళ్ళ రోడ్డులో గల ఆర్మీ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు దుర్గహర్షవర్ధన్‌కు, సమీపంలోని మహబూబ్‌బాష అనే వ్యక్తికి చిన్నపాటి వాగ్వాదం జరిగిందన్నారు. దీనిపై విచారించగా ఆర్మీ సెంటర్‌లోని యువకులు సెంటర్ కాంపౌండ్‌లో షార్ట్స్ వేసుకుని ఉండటంతో చుట్టుపక్కల మహిళలు ఉన్నారు, ఇది పద్ధతి కాదని మహబూబ్‌బాష దుర్గహర్షవర్ధన్‌కు సూచించారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే ఈ వ్యవహారంలో దుర్గహర్షవర్ధన్ సోషల్ మీడియాలో తప్పుడు కథనం ప్రచారం చేశారు. ఈ వ్యవహారంలో కులాలు, మతాలకు సంబంధించిన అంశాలు ఏవీ లేవని తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని ఆయన సూచించారు.

ఉగ్రవాదులను భారత ప్రభుత్వానికి అప్పగించాలి

పోరుమామిళ్ల : జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని ప్రజలందరూ ఖండిస్తున్నారని, పహల్గాం ఉగ్రవాదులను భారత ప్రభుత్వానికి అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ పహల్గాం దుర్ఘటనను ఆసరా చేసుకుని దేశంలోని మనువాదులు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలు చేస్తున్నారని, వాటిని ప్రజలు సమైక్యత, శాంతితో తిప్పికొట్టాలని తెలిపారు. సమావేశంలో సీపీఎం నాయకుడు భైరవప్రసాద్, జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్.గౌసియాబేగం, మండల కమిటీ సభ్యులు శ్రీనివాసులు, మేరీ, ఓబులమ్మ పాల్గొన్నారు.